క్లుప్తంగా

నిత్యావసరాల అందజేత



నిత్యావసర సరుకులు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కాళ్ల: తమతో పాటు కలిసి చదువుకుని ఆకస్మికంగా మరణించిన మిత్రుడి కుటుంబానికి తోటి విద్యార్థులు అండగా నిలుస్తున్నారు. కాళ్ల మండలం కోపల్లె గ్రామానికి చెందిన సీహెచ్ రాజన్న గత సంవత్సరం మృతి చెందాడు. 1994– 95 సంవత్సరంలో కోపల్లె హైస్కూల్‌లో చదువుకున్న రాజన్న మరణ వార్త తెలుసుకున్న తోటి విద్యార్థులు ప్రతి నెలా ఆయన కుటుంబానికి నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. ఆదివారం గ్రామంలోని కొంత మంది స్నేహితులతో కలిసి రాజన్న తల్లికి నిత్యావసర సరుకులు అందించారు. కలిసి చదువుకున్న స్నేహితుడి కుటుంబానికి అండగా ఉంటున్న పూర్వ విద్యార్థులను ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు అభినందించారు.

సేవకు చక్కని వేదిక రోటరీ క్లబ్



పేదలకు దోమ తెరలు అందిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

భీమవరం: సేవకు చక్కని వేదిక రోటరీ క్లబ్ అని క్లబ్ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. భీమవరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన పలు సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఒబిలిశెట్టి పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో దివ్యాంగుల పాఠశాలను నిర్వహించి సుమారు 250 మందికి ఆపరేషన్లు చేయించి, వారి జీవితాల్లో వెలుగులు నింపారని అభినందించారు. అనంతరం రోడ్డు పక్క నివాసం ఉంటున్న పేదలకు దోమ తెరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముత్యాల శ్రీనివాస్. ఎం.పద్మకుమారి, గుండు కిషోర్, ఎస్.నరసింహారావు, బొండా వెంకట సుబ్బారావు, ఒబిలిశెట్టి పట్టాభి రామయ్య, మడిపల్లి శేఖర్, షేక్ బాబాజీ, దాతలు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గోపాలస్వామి, మాధవస్వామి కల్యాణం



సిద్ధాంతంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: సిద్ధాంతంలో శ్రీ విజయ గోపాల స్వామి, జగన్మాతలు రుక్మిణిసత్యభామలకు, శ్రీ మాధవ స్వామి, జగన్మాతలు శ్రీదేవి-భూదేవిలవార్ల కళ్యాణం ఆదివారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవల్లి లక్ష్మీనరసింహాచార్యులు, ఖండవల్లి భాస్కరశోభనాద్రాచార్యులు ఆధ్వర్యంలో కసుకుర్తి వెంకటేశ్వర్లు, మానస దంపతులు కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివార్లకు విశేష అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమార్చనలు, ధ్వజారోహణ, అంకురార్పణ, బలిహరణలు నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం స్వామివార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కార్య నిర్వాహణాధికారి ముత్యాల సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అనాథ మృతదేహానికి అంత్యక్రియలు చేస్తున్న అమ్మ ఫౌండేషన్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని గుర్తుతెలియని ఓ మృతదేహానికి ఆదివారం స్థానిక అమ్మ చారిటబుల్ ఫౌండేషన్ సభ్యులు అంత్యక్రియలు చేశారు. శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో రైల్వేస్టేషన్ సమీపంలో బి.శ్రీను అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. అతనికి సొంత వాళ్లు ఎవ్వరూ లేకపోవడంతో పోస్టుమార్టం అనంతరం విషయం తమ ఫౌండేషన్ సభ్యులకు తెలియపరిచారు. విషయం తెలుసుకుని అమ్మ చారిటబుల్ ఫౌండేషన్ తరపున పట్టణ రుద్రభూమిలో అంత్యక్రియలు నిర్వహించినట్లు ఫౌండేషన్ సభ్యులు అనంతపల్లి సతీష్ తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు, కట్ట సాయికిరణ్, షేక్ సిద్దిక్, సుదీర్, అంబటి సాయితేజ, శానిటరీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టి హుళక్కేనా ?



గరగపర్రులో నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డ్



చెత్త నుంచి సంపద సృష్టి లేని గొల్లలకోడేరు డంపింగ్ యార్డ్



పాలకోడేరులో రోడ్డు పక్కన వేసిన చెత్త

- రూ.3.4 కోట్లు చెత్త పాలు
- చెత్తను రోడ్ల వెంబడి పడేస్తున్న వైనం
- ఇక వర్మీకంపోస్ట్ తయారీ ఎప్పుడో ?

పాలకోడేరు: గ్రామాల్లో పారిశుద్ధ్యానికి పెద్దపీట వేస్తూ 2014లో టీడీపీ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు చెత్తకే పరిమితమాయ్యాయి. సంపద సృష్టి దిశగా పయనించడం లేదు అప్పట్లో ఎన్ఆర్ఈజీఎస్ విభాగంలో ఈ కేంద్రాల నిర్మాణానికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేశారు. ఆయా గ్రామాల అధికార పార్టీ సర్పంచులు తెలుగు తమ్ముళ్లు కాంట్రాక్టర్ల అవతారమెత్తి నిర్మించారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వాటిపై ప్రత్యేక దృష్టి సారించింది. కొంత మేరకు చెత్తను సేకరించి వర్మీకంపోస్టు తయారు చేసి సంపద సృష్టి వైపు మళ్లించింది.

మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా ఆ కేంద్రాలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. అవి అలంకారప్రాయంగా మారిపోవడంతో వర్మీకంపోస్టు తయారీ ప్రశ్నార్థకంగా మారింది.

యూనిట్లు 3.4 కోట్లు

ఉండి నియోజకవర్గంలోని కాళ్ల, ఉండి, పాలకోడేరు, ఆకివీడు మండలాల్లో మొత్తం యూనిట్ల ఏర్పాటుకు రూ.3.4 కోట్లు మంజూరు అయినట్లు అధికార గణంకాలు చెబుతున్నాయి. పాలకోడేరు మండలంలో 14 కేంద్రాలకు గాను 11, ఉండి మండలంలో 19 కేంద్రాలకు గాను 19, కాళ్ల మండలంలో 21 కేంద్రాలకు గాను 19, ఆకివీడు మండలంలో 16 కేంద్రాలకు గాను 13 మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన కేంద్రాల పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. ఇప్పటి వరకు పూర్తి అయిన కేంద్రాల్లో కొన్ని కేంద్రాల్లో తప్పా మిగిలిన కేంద్రాలు నిరుపయోగమయ్యాయి. వాటికి రంగులు వేయడం తప్పితే సేంద్రియ ఎరువుల తయారీపై దృష్టి సారించడం లేదు.

ఎక్కడి చెత్త అక్కడే

చెత్త నుంచి సంపదతో పాటు వీటిలో వర్మీకంపోస్టు తయారీపై అధికారులు తొలుత దృష్టి పెట్టారు. అయితే ప్రస్తుతం వీటిపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా పంచాయతీ స్థలాలు ఉన్న చోట్ల కాంట్రాక్టర్లు నిధులు దోచుకునేందుకు వీటిని నిర్మించి వదిలేశారు. దీంతో గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తుంది.

డస్ట్ బిన్లు పంపిణీ చేశాం

మండలంలో 14 కేంద్రాలకు గాను 11 పూర్తి చేశాం. కొన్ని గ్రామాల్లో చెత్తను సేకరించి వర్మీ కంపోస్ట్ కంపోస్ట్ తయారు చేస్తున్నాం. మిగిలిన గ్రామాల్లో నిర్మాణాలు పూర్తి చేసి చెత్త నుంచి సంపద తయారీకి చర్యలు చేపడతాం.

–ఎంపీఎస్ రామ్‌ప్రసాద్, ఈవోపీఆర్డీ, పాలకోడేరు

డంపింగ్ యార్డులకు తరలించడం లేదు



చెత్త నుంచి సంపద సృష్టిస్తామని ఆర్భాటంగా ప్రచారం చేస్తున్న కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ఆ ఊసే ఎత్తడం లేదు. గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించకుండా ఎక్కడపడితే అక్కడ రోడ్ల పక్కన, కాలువ గట్లపైన, డ్రెయిన్ల గట్ల వెంబడి పడేస్తున్నారు. ఇది సరికాదు అధికారులు చర్యలు తీసుకోవాలి.

–కొండేటి లాజరు, కుముదవల్లి

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



రోడ్ల పక్కన ఎక్కడబడితే అక్కడ చెత్తను పడవ వేస్తున్నారు గ్రామంలో ఉన్న చెత్తను తీసుకెళ్లి రోడ్ల వెంబడి పారబోయడంతో ఆ దారిలో వెళ్లాలంటే ముక్కు మూసుకుని ప్రయాణించాల్సి వస్తుంది. ఇళ్ల నుంచి చెత్తను కూడా సరిగా సేకరించడం లేదు. కొన్ని చోట్ల చెత్తను రోడ్ల వెంబడి కాల్చేస్తున్నారు. చెత్త నుంచి సంపద సృష్టిపై ప్రభుత్వానికి చిత్త శుద్ధిలేదు. ఇకనైనా ఆ దిశగా ప్రభుత్వం సమాలోచన చేయాలి.

–సీహెచ్ శ్యామ్, మోగల్లు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు గుడ్డ సంచులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

భీమవరం: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత, ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులనే వినియోగించాలని న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు, అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రమణ్యం, టీడీపీ నాయకురాలు మదాసు కనకదుర్గ అన్నారు. విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భీమవరం గునుపూడిలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించి బాలికలకు గుడ్డ సంచులను పంపిణీ చేశారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, ఎస్‌కే చాన్ భాషా, కొండ్రు శ్రీనివాస్ మాట్లాడుతూ నెల నుంచి ప్లాస్టిక్ నిషేధంపై వాడవాడలా అవగాహన ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ప్లాస్టిక్ నిషేధం మన కర్తవ్యమని, గుడ్డ సంచులనే వాడాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించకపోతే మున్సిపల్ అధికారులు కఠిన చర్యలతో పాటు జరిమానాలు విధిస్తున్నారని తెలిపారు. అనంతరం 60 మందికి ఉచితంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు.

పిల్లల పెంపకం ఆదర్శనీయంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న ముఖ్య వక్త డాక్టర్ శ్రీవిద్య

ఆకివీడు: పిల్లలకు సత్ప్రవర్తన అలవాటు చేయాలని ప్రముఖ పిల్లలు, టీన్స్ మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ జి.శ్రీవిద్య అన్నారు. స్థానిక షాదీఖానాలో తల్లిదండ్రుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంలో తల్లిదండ్రులు ప్రముఖ పాత్ర వహించాలన్నారు. సమాజంలో అనేక రకాల దుష్పరిణామాలకు పిల్లలను దూరంగా ఉంచాలన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కేఎల్ మాధవి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం కోసం ఇటువంటి సమావేశాలు, సదస్సులు తరచూ నిర్వహించాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ అలేఖ్య జంపన మాట్లాడుతూ సమాజంలో పిల్లల భవిష్యత్‌కు తల్లిదండ్రుల బాధ్యత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పీబీ ప్రతాప్‌కుమార్, ఉండ్రమట్ల సాంబశివరావు, యు.కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న భూపతిరాజు రవీంద్రరాజు

భీమవరం: రేషనలైజేషన్ విధానం వలన వీఆర్వోలకు నష్టం వాటిల్లుతుందని జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు పేర్కొన్నారు. గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా స్థాయి సమావేశం ఆదివారం భీమవరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమోషన్లు, విలీనం తదితర వాటిపై ముందుగా స్పష్టత ఇవ్వాలన్నారు. సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు కల్పించిన తర్వాతే రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాలన్నారు. సచివాలయాల్లో రెవెన్యూ శాఖకు సంబంధం లేని సర్వేలు, పనులు చేయిస్తూ ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. అదే విధంగా పాత బకాయిలు, డీఏలు, ఐఆర్, పీఆర్సీపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ నాయకులు మిరియాల లక్ష్మీనారాయణ, జకరయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి



విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను అందిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: దాతలు అందిస్తున్న సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకోవాలని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో అల్లూరి సీతారామరాజు సేవా సమితి ఆధ్వర్యంలో 47 మంది దాతల సహకారంతో పట్టణంలోని 219 మంది విద్యార్థులకు రూ.10.95 లక్షల స్కాలర్ షిప్‌లను ఎమ్మెల్యే అంజిబాబు అందించారు. ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లోనూ రాణిస్తారని, ప్రతిభకు పేదరికం అడ్డు కాదని అన్నారు. కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ వేగేశ్న కనకరాజు సూరి, సుబ్బరాజు, సుబ్రహ్మణ్యరాజు, ఇందుకూరి రామలింగరాజు, వేగేశ్న రమణరాజు, జి.సత్యనారాయణరాజు, వేగేశ్న రామకృష్ణంరాజు, ఝాన్సీ, కనుమూరి సత్యనారాయణ రాజు, పొత్తూరి బాపిరాజు, కారుమూరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎస్ సునీల్‌కుమార్ సస్పెన్షన్ ఎత్తివేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఇండియన్ మిషన్ ప్రతినిధులు

ఆకివీడు: ఐపీఎస్ సునీల్‌కుమార్ సస్పెన్షన్‌ను ఎత్తివేసి, వెంటనే విధుల్లోకి చేర్చుకోవాలని అంబేడ్కర్ ఇండియన్ మిషన్ డిమాండ్ చేసింది. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బండి మధు మాట్లాడుతూ ఏ విధమైన నోటీసులు ఇవ్వకుండా కుట్రపూరితంగా సునీల్‌కుమార్‌ను కూటమి ప్రభుత్వం సస్పెండ్ చేసిందన్నారు. సస్పెండ్‌ను వెంటనే రద్దు చేసి, దళితుడైన సునీల్‌కుమార్‌ను విధుల్లోకి చేర్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాడేపల్లి జాకబ్ చిరంజీవి రాజు, పీతల రాజు, గుండోలు బాలేసు, కటికతల సుదర్శనమ్, మరపట్ల పీటర్‌పాలు, కురెళ్ల శేఖర్, గుంట్ల నాని, భూపతి సామ్యేలు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ధ్యాన శిక్షణ ఏర్పాటు



ఉచిత ధ్యాన శిక్షణ నిర్వహిస్తున్న పిరమిడ్ మాస్టర్లు

వీరవాసరం: మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక తమలపాకు వీధిలో సీతారామాలయ ప్రాంగణంలో ఉచిత ధ్యానశిక్షణ కార్యకమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కోనసీమ జిల్లా అంగర గ్రామానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ రమణ ఉమాదేవి దంపతులు పాల్గొని జ్ఞానబోధ చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఏదైనా విషయం తెలియకపోవడం అజ్ఞానం కాదని, తెలిసిన తరువాత ఆచరించకపోవడమే అజ్ఞానమని, ధ్యానం సర్వరోగ హారిణి, ధ్యానం సకల భోగకారిణి, ధ్యానం సత్యాజ్ఞాన ప్రసాదిని అని తెలిపారు. కార్యక్రమంలో మేక వెంకటేశ్వరరావు, మేడిశెట్టి కృష్ణారావు, ఉదయ్, వర్రె విశ్వేశ్వరరావు, కృష్ణవేణి, ఆదిరెడ్డి పద్మ, పైడమ్మ, అల్లు రామసుబ్బలక్ష్మి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

యువతిని కాపాడిన యువకులకు సన్మానం



చించినాడలో మత్స్యకార యువకులను సన్మానిస్తున్న సర్పంచ్ దంగేటి రాజమణి

యలమంచిలి: ఇటీవల ఒక యువతి ప్రేమ విఫలం కావడంతో చించినాడ వద్ద వశిష్ఠ గోదావరి నది వంతెన మీద నుంచి గోదావరిలో దూకింది. ఆ సమయంలో తమ పడవపై చేపల వేటకు వెళ్లిన మత్స్యకార యువకులు చుక్కా శ్రీను, చుక్కా లోకేష్ (ఇద్దరూ అన్నదమ్ములు) వెంటనే ఆ అమ్మాయిని కాపాడారు. దీంతో ఆ యువకులను ఆదివారం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ దంగేటి రాజమణి శాలువా, పూలమాలతో సన్మానించారు. యువతి కుటుంబ సభ్యులు యువకులకు నూతన వస్త్రాలు, సెల్‌ఫోన్ బహూకరించి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సై కర్లీడి గుర్రయ్య ఇద్దరు యువకులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు నల్లి సంధ్యారాణి, గ్రామ ఉప సర్పంచ్ రుద్రరాజు చిన్న, రిటైర్డ్ ఎంఈఓ ముదునూరి రంగరాజు, మాజీ ఎంపీటీసీ విప్పర్తి సాయిబాబు, పంచాయతీ కార్యదర్శి మాదాసు హరిప్రసాద్, వార్డు సభ్యులు కఠారి నారాయణస్వామి, నల్లి నరేష్, వడ్డి రారాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆకివీడు: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 10వ తేదీన మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ మేరకు సోమవారం మధ్యాహ్నం ఒకటి నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆకివీడు, గుమ్ములూరు రోడ్డులోని ఫీడర్లు, అజ్జమూరు ఫీడర్లలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

20న యూపీఎఫ్ సమావేశం

ఉండి: ఈ నెల 20వ తేదీ గురువారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉండి మండల యునైటెడ్ పాస్టర్స్ ఫెడరేషన్ (యూపీఎఫ్) సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్ష, కార్యదర్శులు సోదదాసి పీటర్, బ్రదర్ ములపర్తి యోనాతాను ఆదివారం తెలిపారు. ఉండి జంగాల కాలనీలో నల్లి సామ్యూల్‌రాజు ఆధ్వర్యంలో ఐపీసీ చర్చ్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ కార్యదర్శి మేడిద జాన్సన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. కాబట్టి యుపీఎఫ్ సభ్యులు విధిగా ఈ సమావేశానికి హాజరు కావాలని వారు తెలిపారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

భీమవరం: రాజ్యాంగాన్ని రక్షించుకునే బాధ్యత దళితులపై ఉందని, రాజ్యాంగానికి తూట్లు పొడవడానికి కొన్ని శక్తులు బయలుదేరాయని జాతీయ దళిత నాయకుడు జేబీ రాజు అన్నారు. భీమవరం అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజ్యాంగ రక్షణపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ వాటిని ఎదుర్కొనేందుకు ధైర్యంగా దళిత ఉద్యోగులు, నాయకులు యువకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బి.రత్నప్రదీప్, సలీం రాజు, కేసీ రాజు, శ్రీకర్, గంటా సుందర్ కుమార్, వర్ధనపు రాజేష్, కుమార్‌రాజు, సంది విజయ్ కుమార్, సుదీర్ బాబు, కృష్ణ మోహన్, రాజేష్‌కుమార్, దేవదానం, బండి మధు, బుంగ అధాం, కోనా జోసెఫ్, ఈది రవికుమార్, కమలకర్, తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్ట్

పాలకొల్లు సెంట్రల్: పట్టణ ఎక్సైజ్ అధికారులు పాలకొల్లు మండలంలో ఆదివారం తనిఖీలు చేయగా శివదేవుని చిక్కాల గ్రామంలో ఓ వ్యక్తి బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు గుర్తించామని ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. ఈ తనిఖీల్లో బి.ప్రసాద్ అనే వ్యక్తి బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నాడని అతని నుంచి ఆరు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. బెల్ట్ షాపులు ఎవరు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముఖదారమ్మ ఉత్సవాల వాల్‌పోస్టర్ విడుదల

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అచ్చుగట్లపాలెం చిత్రావిచెరువు గట్టున కొలువై ఉన్న శ్రీ ముఖదారమ్మ వారి జాతర మహోత్సవాల వాల్‌పోస్టర్లను ఆదివారం కమిటీ సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కుంపట్ల లక్ష్మణ గోవింద్ మాట్లాడుతూ ఈ నెల 30 ఉగాది రోజున అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఏప్రిల్ 7 వరకూ తొమ్మిది రోజులు పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చెక్కా కృష్ణ, వెలిగట్ల గణేష్, చినిమిల్లి బాబీ, కొల్లంశెట్టి చిన్ని, బెల్లంకొండ నరసింహారావు, దైవాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జైన మందిరం ప్రతిష్ఠాపనోత్సవాలు



ఆచంట జైన మందిర ప్రతిష్టకు తరలివస్తున్న గురువులు



ఆచంటలో జైన మందిర ప్రతిష్ఠాపనోత్సవం చేస్తున్న దృశ్యం

పెనుగొండ: ఆచంటలో రాజేంద్ర సూరీజీ గురుధ్యాన జైన మందిర ప్రతిష్ట మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. జైనులతో ఆచంట కిక్కిరిసిపోయింది. జైన గురువులు పూజలు, ప్రతిష్ఠ హోమాలు, శిఖర ప్రతిష్ఠ పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆచంటలో ఓ విభిన్న వాతావరణం నెలకొంది. జైనులను తిలకించడానికి పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో జైన గురువులతో పాటు కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

పురాతన జైన విగ్రహాన్ని అందించిన దేవస్థానం

ఆచంట మదన గోపాల స్వామి ఆలయం వద్ద ఉన్న జైనల 23వ తీర్థంకుడు చతుర్ముక్ పాశ్వనాథ విగ్రహాన్ని దేవస్థానం అధికారులు జైనులకు అందించారు. విగ్రహాన్ని జైనులకు అందించడంతో గత కొంత కాలంగా వివాదం నడిచింది. గ్రామంలో కొందరు అభ్యంతరాలు పెట్టడంతో పాటు, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో కొంత కాలం విగ్రహం అప్పగింత నిలిచిపోయింది. ఇటీవల జైనులు విగ్రహం అందించాలంటూ మరోసారి ముందుకు వెళ్లడంతో అఖిలపక్ష సమావేశాలు నిర్వహించి విగ్రహాన్ని ఇవ్వడానికి అంగీకరించారు. దీంతో ఆదివారం జిల్లా దేవస్థానం అధికారి ఈవీ సుబ్బారావు, దేవస్థానం ఏఈ ఎస్‌కే సైదా, స్థానిక ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ రెవెన్యూ అధికారితో కలిసి అంగీకార పత్రాలు తీసుకుని ట్రస్ట్ అధ్యక్షుడు అజిత్‌కుమార్‌కు విగ్రహాన్ని అప్పగించారు. త్వరలో మార్టేరు రోడ్డులో జైన మందిర నిర్మాణం చేపట్టనున్నారు. పెనుమంట్ర ఎస్సై స్వామి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



అంబేడ్కర్ సెంటర్‌లో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

నరసాపురం: పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్లస్థలాలు, ఇళ్లు, కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పన వంటి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సైకిల్ యాత్ర ఆదివారం నరసాపురం పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో నిర్వహించిన సభలో గోపాలన్ మాట్లాడుతూ కూటమి నేతలు ఎన్నికలు సమయంలో పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున కేటాయిస్తామని చెప్పారని గుర్తు చేశారు. కానీ ఇంత వరకూ ఈ అంశంలో దృష్టి పెట్టట్లేదన్నారు. ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించుకోవడానికి ఇస్తామన్న రూ 5 లక్షలు ఆర్థికసాయం అందించాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన స్థలాలను లే-అవుట్‌చేసి సదుపాయాలు మెరుగుపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ముచ్చర్ల త్రిమూర్తులు, జక్కంశెట్టి సత్యనారాయణ, మామిడిశెట్టి రామాంజనేయులు, గొర్ల రామకృష్ణ, మంచిలి నీలకంఠం, నోముల కొండ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమవరం డివిజన్
90102 23729
90108 51166
Office mail : tpgadvt@gmail.com